లాభసాటి వ్యవసాయమే ప్రభుత్వ లక్ష్యం

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



నరసాపురం రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరాజు

నరసాపురం రూరల్: రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ సలహా మండలి గౌరవాధ్యక్షుడు, ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. శుక్రవారం కమిటీ చైర్మన్ కాండ్రేగుల నర్సింహరావు అధ్యక్షతన నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ అనుబంధ రంగాలలో గలపలు సమస్యలపై చర్చించి ఆయా సీజన్లలో రైతులకు మేలు చేకూర్చే పలు విషయాలపై చర్చించి సూచనలు, సలహాలు అందించేందుకే వ్యవసాయ సలహా మండళ్లను ఏర్పాటు చేశారన్నారు. వ్యవసాయాన్ని రైతులకు లాభసాటి చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. దీనిలో భాగంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, యంత్ర పరికరాలను సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. పంటల విలస్తరణ, పంట మార్పిడి వంటి అంశాల్లో రైతులకు సలహామండళ్ల తోడ్పాటును అందిచాలని ఎమ్మెల్యే ప్రసాదరాజు పేర్కొన్నారు. వరి, ఆక్వా, ఉద్యాన రైతులకు ఆదాయాన్ని చేకూర్చే విధంగా ఆలోచనలు చేసి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి రైతుల ఆదాయాన్ని పెంచేందుకు రైతులతో చర్చించి సూచనలను చేయాలని మండస్థాయి సలహా మండలి సభ్యులకు ఎమ్మెల్యే ప్రసాదరాజు సూచించారు. ప్రభుత్వం కూడా ఆక్వాసాగును ప్రోత్సహిస్తుందన్నారు. అందులో భాగంగా ఆక్వా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎడ్వైజరీబోర్డు మెంబరు సంగాని వడ్డికాసులు, బండారు ఇస్సాకు, ఏయంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, ఆత్మాచైర్మన్ కడలి రాంబాబు, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు తదితరులు మాట్లాడుతూ పలు సూచనలు, సలహాలను సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. కాలువల్లో పూడికతీత, వ్యవసాయశాఖ అధికారుల సేవలు తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఏడీఏ ఈదా అనిల్‌కుమారి, ఏవో జాన్సన్, పులఖండం మాధవరావు, కంకటాల పెద్దిరాజు, కడలి అబద్దం, మైలాబత్తుల శ్రీను, హెన్రీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు, పురుగు మందులు

మొగల్తూరు: సార్వా సాగుకు సంబంధించి రైతులకు అవసరమయ్యే ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ ఏడీఏ ఈ అనిలకుమారి తెలిపారు. శుక్రవారం మొగల్తూరు 3వ సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. నాట్లు వేసుకోవడం ఆలస్యమైనా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు తగు సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పంట వేసుకున్న ప్రతీ రైతు ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు అర్హత పొందుతారన్నారు. జాతీయ రైతు ఉత్పత్తిదారుల సంఘంలో చేరితే కలిగే ప్రయోజనాలను ఎఫ్‌పీఓ సతీష్ వివరించారు. ఈసమావేశంలో సలహా మండలి చైర్మన్ కంచర్ల బాబులు, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, నాయకులు పడవల సత్యనారాయణ, అయితం యుగందర్, ఏవో రహీమ్, వెటర్నరీ డాక్టర్ నీలిమ, తదితరులు పాల్గొన్నారు.



మొగల్తూరు: వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ అనిల కుమారి

మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించాలి

వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మా) సౌజన్యంతో వ్యవసాయ పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మాచైర్మన్ కడలి రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శాస్త్రవేత్తలు డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ రాజేష్, డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ ఖర్చు తగ్గించుకుని, నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేందుకు యాజమాన్య పద్ధతులు అవలంభించాలన్నారు. ఆక్వా, వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేసే సేవిధానాన్ని మార్చుకుని లాభసాటిగా ఉండే విధంగా ఎలా సాగు చేసుకోవాలో? సూచించారు. ఆక్వా చెరువుల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను కూడా వివరించారు.

నేడు దొడ్డిపట్లలో గడపగడపకు మన ప్రభుత్వం

యలమంచిలి: దొడ్డిపట్ల గ్రామంలో శనివారం మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

లోకేశ్, చంద్రబాబులను తక్షణం అరెస్ట్ చేయాలి

పాలకొల్లు అర్బన్: టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతూ శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్న చంద్రబాబు, లోకేశ్‌లను తక్షణం అరెస్ట్ చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. యాళ్లవానిగరువులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యువగళం పేరుతో తన ప్రైవేట్ సైన్యంతో రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. యువగళం పాదయాత్రకు స్పందన కరువవ్వడంతో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మగవారికి రూ.500, ఆడవారికి రూ.300 కిరాయిలు ఇచ్చి జన సమీకరణ చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో గుమ్మాపు సూర్యవరప్రసాద్, పెదపాటి పెద్దిరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లోకేశ్‌ను పట్టించుకోని నరసాపురం ప్రజలు



తిర్రే బాబూరావు

నరసాపురం: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తనయుడు నారా లోకేశ్ నరసాపురంలో నిర్వహించిన యువ గళం పాదయాత్రను నరసాపురం ప్రజలు అస్సలు పట్టించుకోలేదని ఏపీ షెడ్యూల్ కులాల సంక్షేమసంఘం నరసాపురంశాఖ అధ్యక్షుడు తిర్రే బాబూరావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. లోకేశ్ పాదయాత్ర నరసాపురంలో మరీ అట్టర్‌ప్లాప్ అయ్యిందని తెలిపారు. లోకేశ్ రెడురోజులపాటు నరసాపురంలో తూతూమంత్రంగా పాదయాత్ర జరిపారని పేర్కొన్నారు. ఎక్కడా ప్రజలతో అసలు మాట్లాడలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో దళితులు, బీసీలతో సహా అన్ని వర్గాలవారు ముఖ్యమంత్రి జగన్ సాగిస్తున్న ప్రజారంజక పాలనకు అండగా ఉన్నారని వివరించారు.

నరసాపురంలో ఫ్రైడే-డ్రైడే



మురుగు ప్రదేశంలో దోమల మందు చల్లుతున్న మున్సిపల్ సిబ్బంది

నరసాపురం: స్థానిక మున్సిపాటిలో కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. దోమల నిర్మూలన, అంటు వ్యాధులు ప్రబంలకుండా చర్యలు చేపట్టడం ఈ కార్యక్రమం ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది డ్రెయిన్స్‌లో అవసరమైన చోట సిల్ట్ తీయడం, మురుగు కాలువల్లో దోమలు పెరగకుండా మందులు చల్లడం, చెత్త తీసిన ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లారు. అలాగే దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేశారు. ఈ పనులను కమిషనర్ వెంకటేశ్వరరావు ఎప్పటికప్పుడు పరిశీలించారు.

విధులను బహిష్కరించిన న్యాయవాదులు

నరసాపురం రూరల్: న్యాయవాదుల మీద దాడలకు నిరసనగా వెంటనే న్యాయవాద రక్షణ చట్టం అమలు చేయాలని కోరుతూ నరసాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు ఎదుట నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యానాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హోపూర్‌లో న్యాయవాదులపై పోలీసులు జరిపిన లాఠీచార్జికి నిరసనగా విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆర్‌కే బాబ్జి, చిట్టి పద్మజ, శ్రీహరి, దేవ రంజిత్‌కుమార్, కామన బుజ్జి, గొట్టుముక్కల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు

పోడూరు: గ్రామంలో దశలవారీగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు జిన్నూరు గ్రామసర్పంచ్ జమ్ము బేబీ మహలక్ష్మి అన్నారు. గ్రామంలోని ఆంజనేయరాజు నగర్‌లో శుక్రవారం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని జెడ్పీనిధులు రూ.15 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్ నిర్మాణపనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాల సీజన్ కావడంతో వైరల్ జ్వరాలు, చికున్‌గున్యా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు రాకుండా గ్రామంలో అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ జమ్ము బుజ్జి, శెట్టి చినబాబు, గ్రామకమిటీ అధ్యక్షుడు భూపతిరాజు సూర్పరాజు, తొండా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

నరసాపురం రూరల్: పట్టణంలోని ఆదికేశవ ఎంబరుమన్నార్ ఆలయంలో శుక్రవారం వైష్ణవ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైష్ణవ సాంప్రయాదాయంలో రాత్రి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఉట్టిని కొట్టేందుకు పోటిపడ్డారు. ఈ సందర్భంపిల్లలు శ్రీకృష్ణుడు, రుక్మిణి,సత్యభామ, గోపికల వేషధారణలతో అందరిని అలరించారు. స్థానిక తెలగా కల్యాత మూడు రోజులుగా హరే కృష్ణ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో ఇస్కాన్‌కు చెందిన కృష్ణ భక్తులు మధురశ్యాం దాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శుక్రవారం ఏసీ భక్తి వేదాంత స్వామి శ్రీల ప్రభుపాదుల జయంతిని పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. అనంతరం అఖండ అన్నసమారాధనను నిర్వహించారు.

లోకేశ్ రెచ్చగొట్టే మాటలు కట్టిపెట్టాలి

యలమంచిలి: యువగళం పేరిట పాదయాత్ర చేస్తున్న లోకేశ్ తన మాటలతో యువకులను రెచ్చగొట్టి సమాజంలో అలజడి సృష్టించడం సమంజసం కాదని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన నాయకులు ఉచ్చుల స్టాలిన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లోకేశ్ పాదయాత్ర ప్రజా సమస్యలు తెలుసుకోవడానికో, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టడానికో అర్థం కాని విధంగా ఉందన్నారు. యలమంచిలి మండలంలో లోకేశ్ పాదయాత్ర చాలా విడ్డూరంగా జరిగిందని వివరించారు. గ్రామాలలో తిరగకుండా కేవలం బైపాస్ రోడ్డుకే ఆయన పాదయాత్ర పరిమితం కావడం చాలా హాస్యాస్పదంగా పేర్కొన్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వైఎస్సార్ సున్నా వడ్డీ నమూనా చెక్కును అందిస్తున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: మహిళా సంక్షమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో శుక్రవారం జరిగిన పట్టణ పరిధిలోని డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు నాలుగో విడత వైఎస్సార్ సున్నా వడ్డీ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 764 స్వయం సహాయక సంఘాల గ్రూపులకు గానూ రూ.1.43 కోట్లు విలువ చేసే నమూనా చెక్కును సమాఖ్య ప్రెసిడెంట్లు, వీఓలకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నారని తెలిపారు. పసిపిల్లల నుంచి అవ్వాతాతల వరకూ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, తల్లిబిడ్డలకు పౌష్టికాహారం అందించేలా వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్, ఆరేళ్ల పిల్లలనుంచి ఇంటర్ విద్యార్థుల చదువుల కోసం అమ్మ ఒడి అమలు చేస్తున్నామని ఆయన గుర్తుచేశారు. పొదుపు సంఘాల పేరిట బ్యాంకుల్లో ఉండే అప్పు మొత్తం తమ ప్రభుత్వమే భరిస్తుందన్న మాటను ముఖ్యమంత్రి జగన్ నిలబెట్టుకున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి మహిళా అభ్యున్నతి కోసం ఇన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా సున్నా వడ్డీ పథకం ద్వారా నియోజకవర్గంలో సుమారు రూ.25 కోట్లు ప్రభుత్వం జమ చేసిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్మన్ కొత్తపల్లి భుజంగరాయలు, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, కౌన్సిలర్లు బర్రి జయరాజు, కేసరి గంగరాజు పాల్గొన్నారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం

పేదలకు తక్కువ ధరకు ఆహారం అందించేందుకు ప్రభుత్వం పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఆహా క్యాంటీన్లను ప్రారంభిస్తున్నామని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. నరసాపురం బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు తక్కువ ధరకు ఆహారం అందించేందుకు ప్రభుత్వం ఈ ఆలోచన చేసిందన్నారు. ఈ క్యాంటీన్ స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నడుస్తుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కమిషనర్ వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు బొంతు రాజశేఖర్, మల్లాడి బుజ్జి, నిడుమోలు ఉమ, పతివాడ పద్మ పాల్గొన్నారు.

సంచార జాతుల సమస్యలు పరిష్కరిస్తా



గుడాల గోపిని సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న

పాలకొల్లు అర్బన్: నియోజకవర్గంలో సంచార జాతుల సమస్యలు పరిష్కరించడంతో తన వంతు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు వైస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న, పోడూరు మండలం పెనుమదం గ్రామ సంచార జాతులు గుడాల గోపిని కలిసి శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ పోడూరు మండలం పెనుమదంలో సంచార జాతులవారు అసలు మినహా భూమిని ఆక్రమించుకున్నారన్నారు. ఆ భూమిలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు ఆ భూమిని సంచార జాతులకు స్వాధీనం చేయాలని కోరారు. దీనిపై గుడాల గోపి స్పందించి పోడూరు తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సంచార జాతులకు స్థలం కేటాయించాలని కోరారు. సంచార జాతుల నాయకులు గంటా వెంకన్న, పెంద్ర వరహాలు, వాడపల్లి నరసన్న పాల్గొన్నారు.

30 నుంచి ఆరోగ్య సురక్ష

పోడూరు: 'ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30 నుంచి అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో షెడ్యూలు వారీగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.సుహాసిని తెలిపారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగేలా అధికారులు, ప్రభుత్వ సిబ్బంది శ్రద్ధ చూపాలన్నారు. తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, తేజ, సత్యనారాయణ పాల్గొన్నారు.

పోషకాహారంతో మెరుగైన ఆరోగ్యం

పెనుగొండ: పోషకాహారంతో మెరుగైన ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజరు ఎం విజయకుమారి అన్నారు. శుక్రవారం కొఠాలపర్రులోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించి పోషకాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డబ్ల్యూపీఎస్ ఉషాకిరణ్ కుమారి పాల్గొన్నారు.

ప్రేమ పేరిట ఆర్మీ జవాన్ మోసం

అక్కిరెడ్డిపాలెం (విశాఖ): ఓ ఆర్మీ జవాన్ ప్రేమ పేరుతో మరదలను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. దీంతో ఆమె గాజువాక పోలీసులను ఆశ్రయించింది. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు, యువతి తెలిపిన వివరాలల ప్రకారం గాజువాక హిమాచల్‌నగర్‌కు చెందిన ఓ యువతి పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో 2020లో పాలిటెక్నిక్ (మెకానికల్) చదివింది. పోడూరు మండలం కొమ్ముచిక్కలకు చెందిన దుడ్డి ప్రభాకర్ నాగ్‌పూర్‌లో ఆర్మీ జవాన్‌గా పని చేసేవాడు. ఆ సమయంలో వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. మేనత్త కొడుకు అని తెలియడంతో చనువుగా ఉండేది. అతను తరచుగా ఆమెకు ఫోన్లు చేసేవాడు. ఈ క్రమంలో వారి మధ్య ప్రేమ చిగురించింది. 'నేను ఉద్యోగం చేస్తున్నాను. ఇద్దరు వరసయిన వాళ్లం.. నిన్ను పెళ్లి చేసుకుంటా..'అని ఆమెను నమ్మించాడు. అలా కొన్నాళ్లు కాలక్షేపం చేశాడు. ఈ క్రమంలో హైదరాబాద్ తీసుకెళ్లి కొన్ని రోజులు ఒకే ఇంట్లో నివాసం ఉన్నారు. కోరికలు తీర్చుకుని క్రమంగా ఆమెను దూరం పెట్టాడు. దీంతో అనుమానం వచ్చిన ఆమె పెళ్లి చేసుకోమని ప్రభాకర్‌ను నిలదీసింది. దీంతో అతను ముఖం చాటేశాడు. ఈ క్రమంలో యువతి అనారోగ్యం పాలైంది. వీరి వ్యవహారం యువతి తల్లిదండ్రులకు తెలియడంతో వారు ఆందోళనకు గురయ్యారు. తర్వాత జవాన్ తల్లిదండ్రులతో పెళ్లి విషయం మాట్లాడగా.. వారు కూడా పెళ్లి నిరాకరించారు. దీంతో తనకు న్యాయం చేయాలని ఆమె నెల రోజుల కిందట గాజువాక పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు ప్రభాకర్‌ను స్టేషన్‌కు పిలిచి పంపేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. కాగా గురువారం ప్రభాకర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎల్.భాస్కరరావు తెలిపారు.

రామాలయ నిర్మాణాలకు టీటీడీ నిధులు



టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: రామాలయ పునర్నిర్మాణాలకు టీటీడీ నుంచి సుమారు రూ.10లక్షల వరకు నిధులు అందజేస్తున్నట్లు టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు వెల్లడించారు. వరలక్ష్మి వ్రతంలో భాగంగా పట్టణంలోని యడ్లబజారులో ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారిని టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు-శశికళ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కావలి శ్రీనివాసరావు, ఈవో సతీష్‌కుమార్ శేషుబాబు దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అలాగే అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ పెంద్ర వీరన్న, ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాసరావు, జోగి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు గాదె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందడి



పెనుగొండ: కొఠాలపర్రు కేశవ స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు



మొగల్తూరు: ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయంలో సామూహిక కుంకమపూజల్లో పాల్గొన్న భక్తులు

పెనుగొండ: శ్రావణ శుక్రవారం సందర్భంగా పెనుగొండ, ఆచంట మండలాల్లో అమ్మవార్ల ఆలయాల్లో మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రెండో శ్రీరంగంగా పేరుగాంచిన కొఠాలపర్రులోని కేశవ స్వామి ఆలయంలో అమ్మవార్లను వరలక్ష్మి దేవిగా అలంకరించి సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. వడలిలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయం వద్ద, గ్రామ దేవత మందాలమ్మ ఆలయం వద్ద, పెనుగొండలో శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోనూ మహిళలు వందలాదిగా పాల్గొని వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. ఆయా ఆలయాల్లో వరలక్ష్మి పూజా సామాగ్రిని ఆలయ కమిటీలు అందించారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో ట్రస్టు బోర్డు చైర్మన్‌లు కొమ్మిరెడ్డి త్రిమూర్తులు, కోట్ల మోహనరావు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు పంచామృతాభిషేకం

యలమంచిలి: శ్రావణ మాసం ఆఖరి శుక్రవార పర్వదినం పురస్కరించుకుని అడవిపాలెం గ్రామ దేవత కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సుదర్శనం శ్రీనివాసాచార్యులు బ్రహ్మత్వంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, అమ్మవారి పంచలోహ విగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య-పద్మ, పితాని గాంధీ-వెంకటనర్సమ్మ దంపతులు పీటలపై కూర్చుని విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేశారు. అనంతరం సుమారు 100 మంది ముత్తయిదవలు సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్నారు. పూజల నిర్వహణకు గ్రామానికి చెందిన గుబ్బల రామకృష్ణ-పుణ్యవతి దంపతులు రూ.5 వేలు విరాళం అందజేశారు. పూజలో పాల్గొన్న భక్తులు అందరికీ ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి రాగి డాలర్ ఇవ్వగా గ్రామానికి చెందిన తోట రామకృష్ణారావు-శ్రీవల్లి దంపతులు జాకెట్లు బొలిశెట్టి రాధాకృష్ణ-సూర్యకుమారి దంపతులు ప్రసాద వితరణ చేశారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం కావడంతో మండలంలోని పలు అమ్మవారి ఆలయాల్లో సామూహిక కుంకమ పూజలు నిర్వహించారు. స్థానిక భవానీ కాలనీలోని కనకదుర్గమ్మ ఆలయం సుదర్శనం లక్ష్మి నరసింహాచార్యులు ఆధ్వర్యంలోను, బండి ముత్యాలమ్మ ఆలయంతో రాధాకృష్ణ, చైతన్య శర్మ ఆధ్వర్యంలోను కుంకమ పూజలు నిర్వహించారు. ముత్యాలపల్లిలో కుంకమ పూజలు అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

శీతల మాతకు తమలపాకులతో అలంకరణ

నరసాపురం: శీతలమాతగా కొలిచే నరసాపురం రాయిపేట శ్రీపుంతలో ముసలమ్మ అలమ్మవారిని శుక్రవారం తమలపాకులతో ప్రత్యేకంగా అంకరించారు.శ్రావణమసం నాల్గవ శుక్రవారం కావడంతో 1008 తమలపాకులతో అలంకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మిశెట్టి బాబ్జి, ఆలయ అర్చకుడు మంచిలి చంద్రశేఖరశర్మ పర్యవేక్షణలో అలంకరణ ఏర్పాట్లు జరిగాయి. ఆలయంలో మహిళలతో సహస్రదీపాలంకరణ, లలితా సహస్రనామ పారాయణం చేశారు.

12 వేల గాజులతో దుర్గమ్మ అలంకరణ

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు - మార్టేరు ఆర్ అండ్‌బీ రోడ్డులో ఉల్లంపర్రు లో వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మను శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా 12వేల గాజులతో అలంకరించారు. ఆలయ అర్చకస్వామి బాదంపూడి సాంబమూర్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉల్లంపర్రు, బ్రాడీపేట పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెదగోపురంలో

పంచారామ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ముత్తాయిదువలు సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఆలయ మండపంలో నిర్వహించిన ఈ వరలక్ష్మి వ్రతాల్లో పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి సుమారు 800పైగా ముత్తయిదువలు పాల్గొని వ్రతాలు నిర్వహించారు. ఆలయ అభిషేక పండితులు భమిడిపాటి వెంకన్న, అనిల్‌కుమార్, పూర్ణయ్యల బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. పూజ అనంతరం మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, పువ్వులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యళ్ల సూర్యనారాయణ, ట్రస్టీలు చింతా కాత్యాయిని, కాండ్రేకుల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.